


సంపర్తి శ్రీనివాస మూర్తి

అదొక ఆఫీసు. ఆ ఆఫీసులో రెండు ఫోన్లు, ఓ ఇరవై కుర్చీలు, టేబుల్స్ వున్నాయి. పాపం అవి ఇరవై నాలుగ్గంటలు ఆఫీసులోనే వుంటాయి. వారంలో ఏడు దినాలూ పనిదినాలే వాటికి. అయితే అప్పుడప్పుడు కొన్ని ఆకారాలు వచ్చి కుర్చీలు కోప్పడతాయేమోనని వాటి మీద కొంచెం సేపు కూర్చొంటాయి. కానీ, ఫోన్లకు మాత్రం ఎప్పుడూ విశ్రాంతి వుండదు.

అటువంటి ఆఫీసుకు పిచ్చయ్య అనే ఓ కొత్త కాంట్రాక్టరు తనకు రావలసిన బిల్లు కొరకై వెళ్ళాడు.

ఆ రోజు సోమవారం.

ఉదయం పది గంటలు.

ఒక్కసారి ఓ ఇరవై కంఠాలు 'గుడ్ మార్నింగ్' చెప్పాయి పిచ్చయ్యకు.

పిచ్చయ్య ఉలిక్కిపడి చూశాడు.

కుర్చీలు తప్ప అక్కడేమీ కనపడవు. ఆశ్చర్యపోయాడు పిచ్చయ్య.

అలాగే పదకొండున్నర గంటల వరకు జుట్టు పీక్కుంటూ, గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్నాడు పిచ్చయ్య. అప్పుడు వచ్చింది ఓ ఆకారం. రాగానే ఫోను అందుకొంది.

"శెట్టిగారూ రాసుకోండి సామాన్ల పట్టి. నేను మరల వచ్చి పట్టుకెళతా. కందిపప్పు 4 కిలోలు, పెసరపప్పు 3 కిలోలు......"అలా సాగిపోతోంది ఫోన్లో సంభాషణ.

మరో అరగంటకు మరో నాలుగు ఆకారాలు వచ్చాయి. అవి తమ వెంట తెచ్చుకొన్న 'క్యారియర్స్'ను డైనింగ్ రూములో పెట్టి, క్యాంటీను వైపుదారి తీశాయి. పిచ్చయ్య ఒక్కసారిగా పరుగెత్తుకెళ్ళి తన బిల్లు సంగతి అడిగాడు.

"ఆ సెక్షన్ క్లర్కు ఇంకా రాలేదు. వస్తాడు. కూర్చోవయ్యా" అంది ఓ భారీ ఆకారం పిచ్చయ్యను ఎగాదిగా చూసి.

ఈ ఆఫీసు సంగతి తెలియని వాళ్ళని అలాగే చూస్తారని పాపం పిచ్చయ్యకు తెలియదు.

సమయం పన్నెండున్నర.

అప్పుడే వచ్చింది పిచ్చయ్య బిల్లు 'సంగతి' చూడవలసిన ఆకారం.

రాగానే ఒకసారి వికారంగా చూసింది పిచ్చయ్యను.

"ఏమయ్యా! అప్పుడే తెల్లారిందా. అంత తొందరయితే ఎలా?"

"సార్ నా బిల్లు ఇప్పటికే ఆలస్యమ... లేక చాలా ఇబ్బందిగా వుంది. కాంట్రాక్టు పని ... వెంటనే చేసేశాను కదా".

"నీ ఇబ్బంది సరేనయ్యా. మరి నా 'ఇబ్బంది'ని ఎవరు చూస్తారు" అని సిగరెట్ కోసం రోడ్డున పడింది ఆ ఆకారం.

ఇబ్బంది అనే పదాన్ని ఆ ఆకారం వత్తిపలకడం గమనించలేదు పిచ్చయ్య.

సరిగ్గా అయిదు నిముషాలు తక్కువ ఒంటి గంటకు తిరిగొచ్చింది.

రాగానే పాపం పిచ్చయ్య ఫైలు కోసం వెతికింది. అది ఎక్కడా కనబడలేదు. ఇంతలో ఒంటిగంట దాటిపోయింది.

"చూడు భోజనం టైమ్ అయింది. మధ్యాహ్నం మూడింటికి రా" అని వెనక్కు తిరగకుండా డైనింగ్ రూములోకి పరుగులాంటి నడకతో వెళ్ళిపోయింది ఆ ఆకారం.

'అదేమిటి 'లంచ్' టైము అరగంటే గదా. మరి మూడింటిదాకా రావద్దంటాడే!' అని ఆశ్చర్యపోయాడు పిచ్చయ్య.

పాపం పిచ్చయ్యకు కూడా ఆకలే గదా!

భోజనం కోసం ఇంటికెళ్ళి ఐ.ఎస్.టి. ప్రకారం సరిగ్గా మూడింటికి వచ్చాడు.

రాగానే—

డైనింగ్ రూములో ఒక కుర్చీలో కాళ్ళు మరో కుర్చీలో తలపెట్టి నిద్రపోతున్న ఆకారాన్ని గుర్తించాడు. అలాంటి అవస్థలోనే మరికొన్ని ఆకారాలను కూడా చూశాడు. అవన్నీ లేచేదాకా వెయిటింగ్ రూములో వెయిట్ చేస్తూ కూర్చున్నాడు పిచ్చయ్య. నాలుగ్గంటలకు లేచింది ఆ ఆకారం. లేవంగానే డిపార్టుమెంట్ ఇచ్చిన నాప్‌కిన్, సోపు తీసుకుని బాత్‌రూమ్‌లో దూరి ఓ అరగంట తర్వాత బయటికి వచ్చి తన టేబుల్ పై వుంచిన కళ్ళజోడు పెట్టుకుని క్యాంటీనుకు వెళ్ళింది.

ఐదింటికి సిగరెట్ తాగుతూ వచ్చి కుర్చీలో కూర్చుంది.

"ఇంక ఇవాళ ఏం 'మూడ్' బాగాలేదు. రేపు రాగానే తప్పకుండా ముందు నీ పనే చూస్తాను". అంది. ఈ ఆకారానికి ఎప్పుడు మూడుతుందో, ఏమో అనుకొంటూ వెళ్ళిపోయాడు పిచ్చయ్య. మరుసటిరోజు మంగళవారం.

ఆఫీసుకు వెళ్ళిన పిచ్చయ్య తనకు కావలసిన ఆకారం సీటు ఖాళీగా వుండడం చూశాడు. విచారించి కారణం తెలుసుకొన్నాడు.

వాళ్ళ ఆఫీసరు 'క్యాంప్' కెళ్ళినందున ఆ రోజు ఆఫీసుకు రాదట ఆ ఆకారం. మరల 'నిరుత్సాహంతో' చేతులు ఊగించుకుంటూ వెళ్ళిపోయాడు పిచ్చయ్య.

మరుసటి రోజు బుధవారం.

పదింటికే వెళ్ళిన పిచ్చయ్యకు పన్నెండుగంటలకు కనిపించింది ఆ ఆకారం.

అతి కష్టం మీద ఫైలు కోసం వెదికింది. అది టేబుల్ పైన వున్న ఫైళ్ళ మధ్యనే కనపడింది.

...దులో రెండే రెండు గీతలు గీసి, ...వును కేకేసి ఫైలును ఆఫీసరు రూమ్‌... ...పింది. పిచ్చయ్య ఆనందపడిపోయాడు. అయితే ...కారాలలోకి 'పెద్ద' ఆకారమైన ఆఫీసరు అనే ఆకారం ఆ రోజు వచ్చిన ఇంగ్లీషు పేపరు చూస్కొని ఇంటికి ఫోన్చేసి పెళ్ళాం ఆకారాన్ని "రడీ గా వుండు మ్యాట్నీ సినిమా కెళదాం"అని వడివడిగా లేచి వెళ్ళిపోయాడు.

ఆ రోజుకు ఇక విసుగు పుట్టి పిచ్చయ్య కూడా ఒక సినిమాకు వెళ్ళాడు.

మరుసటి రోజు గురువారం.

పిచ్చయ్య పట్టువదలని విక్రమార్కునిలా ఆ రోజూ వచ్చాడు చాలా ఓపిగ్గా.

ఆ రోజు ఒక ఆకారం కొత్త బట్టలు వేస్కొని శోభన్ బాబులాగా 'కటింగ్' చేయించుకొచ్చిందట—అందుకు ఆఫీసులో అంతా పార్టీలో తల మునకలై వున్నారు.

ఎలాగో కావలసిన ఆకారాన్ని పట్టుకొని నిలదీశాడు పిచ్చయ్య.

అయితే ఆ ఆకారం నిలబడలేదు. బిజీగా వెళ్ళిపోయింది.

అప్పటికి విసిగిపోయిన పిచ్చయ్య కోపంతో ఆఫీసరు రూములోకి వెళ్ళాడు. ఆఫీసరువారు కాళ్ళు టేబుల్‌పై పెట్టుకుని చిన్న గురక పెడుతుండడం కనిపించింది పిచ్చయ్యకు.

ధైర్యం తెచ్చుకుని "సార్" అన్నాడు.

ఒక్కసారి ఉలిక్కిపడి లేచాడు.

అంత గురకలో కూడా వెంటనే లేచినందుకు

రాబోవు సంచికల్లో మీరు ఊహించని కొత్త శీర్షిక ???

సంతోషం వేసింది పిచ్చయ్యకు.

విషయం చెప్పాడు.

"గుమాస్తాను పంపించు" అన్నాడు నిద్ర మొఖంతో.

కొంచెం సేపటికి గుమాస్తా ఆకారం ఆఫీసరు రూములోకి వెళ్ళింది.

కొంచెం సేపటికి బయటికి వచ్చింది.

రాగానే పిచ్చయ్య చెవిలో గుసగుసలు......

"అలా చేస్తే రేపు ఖచ్చితంగా బిల్లు పాసవుతుందంటావా. అయితే ఇదిగో. మిగతాది రేపు" అన్నాడు పిచ్చయ్య.

ఆ ఇచ్చిందేదో తీసుకొంది ఆ ఆకారం. మరల ఒకసారి ఆఫీసరు రూమ్‌లోకి వెళ్ళి తిరిగొచ్చింది.

మరసటి రోజు శుక్రవారం.

ఆ రోజు ఒకటి, రెండు ఆకారాలే కనిపించాయి పిచ్చయ్యకు.

కారణం తెలిసికొని బావురుమన్నాడు.

నాలుగు రోజులు సెలవులు కలిసి వస్తాయని ఆ రోజు మరియు సోమవారం క్యాజువల్ లీవ్ పెట్టి వాళ్ళ అత్తగార్ల ఊర్లకు వెళ్ళిపోయాయట. వాటిలో తనకు కావలసిన ఆకారం కూడా వుండడంతో ఏడుపొచ్చింది పిచ్చయ్యకు. "మరలా మంగళవారం దాకా ఆగాలి" అని కర్చీఫుతో తుడుచుకొంటూ ఇంటి దారి పట్టాడు. త్రోవలో 'టీ' కొట్లో టీ త్రాగుతూ పేపరు చూశాడు పిచ్చయ్య.

అందులో మొదటి పేజీలోని వార్త చదువుకొని ఒక్కసారి పిచ్చి పట్టినట్లుగా నవ్వుకొన్నాడు. తనకు, ఉద్యోగులకు వున్న బంధం 'అన్న' దమ్ములబంధం లాంటిదని అభివర్ణించుకొన్న ఓ 'అన్న'—సారీ ఓ మంత్రిగారి స్టేట్‌మెంట్ అది.

"వారానికి అయిదు పనిదినాలు సత్ఫలితాలను ఇచ్చింది. ప్రజలు కూడా అలవాటు పడిపోయారు. ఉద్యోగుల ప్రతిభ పెరిగింది".


# తెలుగు సాహిత్య ప్రియులకు అపూర్వావకాశం!

తెలుగులో వచ్చిన చారిత్రక నవలల్లో, ఉత్తమమైనదనీ తెలుగుల సంస్కృతి స్వరూపంగా ఉన్నదనీ, మహాకావ్యంగా ఉన్నదని-శ్రీ విశ్వనాథ సత్యనారాయణ, శ్రీ పింగళి లక్ష్మీకాంతం, డా. దివాకర్ల ప్రభృతులు ప్రశంసించిన- **"తిక్కన సోమయాజి"** చారిత్రక నవలను మళ్ళీ తెలుగువారికి అందివ్వాలని మేము పునర్ముద్రించాము.

ఆంధ్ర సాహిత్యానికే కాక, విశ్వసాహిత్యానికే అలంకారమైన రచన అని డా. సర్వేపల్లి రాధాకృష్ణ, శ్రీ విశ్వనాథ సత్యనారాయణ, శ్రీ పింగళి, డా. దివాకర్ల వంటి పెద్దలు కొనియాడిన **"ధర్మనిర్ణయం"** (నవల)ను కూడా మేము మళ్ళీ అందరికీ అందుబాటులోకి తెచ్చాము.

ఈ రెండు నవలల పైనా- (దేని కది ప్రత్యేకంగా)-అధ్యయన వ్యాసాలను ఆహ్వానిస్తున్నాము. అధ్యయన వ్యాసాలు-ఎంత పరిమితిలో ఉండాలో, నియమావళి ఏమిటో- ఆ నవలలో ఉన్న కూపనులలో వివరించాము. ఆ కూపనులను అధ్యయన వ్యాసాలతో జతపరచి పంపాలి.

ఉత్తమమైన యీ రెండు నవలలకూ-దేనికది రు. 25/-లు మాత్రమే వెల ఉంచాము. ఎవ్వరైనా యీ పోటీలో పాల్గొనవచ్చును. రెండు నవలలపైనా వేరు వేరుగా ఎవ్వరైనా గాని- పోటీకి వ్యాసాలు పంపవచ్చు. ఒక్కోదానిపైనా పంపవచ్చు. నిర్ణేతలు నిర్ణయించిన ఉత్తమ వ్యాసానికి (ఒక్కొక్క నవలపైనా)రు.1116/-లు పారితోషికం ఇస్తాము. "ధర్మనిర్ణయం" నవలపై ఉత్తమ వ్యాసాన్ని నిర్ణయించడానికి డా. కేతవరపు రామకోటి శాస్త్రి (కాకతీయ యూనివర్శిటీ ఆంధ్ర శాఖాచార్యులు) డా. శలాక రఘునాథ శర్మ (శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ ఆంధ్ర శాఖాచార్యులు) డా. బొడ్డుపల్లి పురుషోత్తము (నాగార్జునయూనివర్శిటీ ఆంధ్ర శాఖాచార్యులు) నిర్ణేతలుగా ఉండటానికి అంగీకరించారు. తిక్కన సోమయాజి నవలపై ఉత్తమ వ్యాసాన్ని నిర్ణయించడానికి డా. అమరేశం రాజేశ్వరశర్మ (ఉస్మానియా విద్యాలయ ఆంధ్ర శాఖాచార్యులు) డా. అక్కిరాజు రమాపతిరావు (తెలుగు అకాడమీ) డా. కోవెల సుప్రసన్నాచార్య (కాకతీయ యూనివర్శిటీ ఆంధ్ర శాఖాచార్యులు) నిర్ణేతలుగా ఉండటానికి అంగీకరించారు.

వ్యాసాలు మాకు చేరవలసిన ఆఖరు తేదీ 10 ఏప్రిల్ 1986. (అనివార్య కారణముల వలన యీ తేదీ మార్చవలసి వస్తే-మార్చబడును)

ఈ రెండు నవలల్లో ఏది కావలసినా రు. 15/-లు మనియార్డరు పంపితే మిగిలిన సొమ్ముకు వి.పి.పి.గా పంపబడుతుంది.

పుస్తక వ్యాపారులకు ప్రత్యేక సదుపాయములున్నవి.

## శ్రీ రాఘవ పబ్లికేషన్స్

*30, కస్తూరి రంగన్ రోడ్, ఆళ్వారు పేట, మద్రాసు-600 018.*